గురజాడ పురస్కారం 'చాగంటి'కి ఇవ్వొద్దు

అనంతపురం : సామాజిక మూఢ విశ్వాసాలకు వ్యతిరేకంగా, మహిళల అభ్యున్నతికి కషి చేసిన గురుజాడ అప్పారావు పేరున ఇచ్చే పురస్కారాన్ని మూఢవిశ్వాసాలను ప్రోత్సహించేలా ప్రచారం చేసే చాగంటి కోటేశ్వరరావుకు ఇవ్వడం సరికాదని సాహితీ స్రవంతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పిళ్లా కుమారస్వామి తెలిపారు. విజయనగరం జిల్లాలో కొన్ని సాహితీ సాంస్కతిక సంస్థల ఆధ్వర్యంలో గురజాడ పురస్కారాన్ని ఏటా అందజేస్తున్నారన్నారు. ఈసారి ఈ పురస్కారాన్ని మూఢచార విశ్వాసాలను పాటించాలని నిత్యం ప్రచారం చేసే ప్రవచన కారుడు చాగంటి కోటేశ్వరరావుకు ఇవ్వాలని ఆ సంస్థలు నిర్ణయించడం సరికాదన్నారు. వితంతు వివాహాలు, స్త్రీల అభ్యున్నతిని ప్రోత్సహించిన గురజాడ ఆశయాలకు భిన్నంగా మనువాదాన్ని ప్రచారం చేసే ప్రవచన కారులకు గురజాడ పురస్కారం ఇవ్వడమంటే గురజాడ ఆశయాలను బలి తీసుకోవడమే అవుతుందని అన్నారు. గురజాడ భావజాలానికి భిన్నంగా సనాతన ధర్మం పేరిట స్త్రీల స్వేచ్ఛ స్వాతంత్ర్యాలను హరించే ప్రసంగాలు చేసే వారికి గురజాడ పురస్కారం ఇవ్వడం గురజాడను అవమానించడమే అవుతుందని అన్నారు. ఇప్పటికైనా ఈ ఆలోచన మానుకుని గురజాడ భావజాలనికి అనుగుణంగా సమాజాభివద్ధికి సేవలు అందించే వారికే పురస్కారం ఇవ్వాలని కోరారు.

ప్రజల మధ్య

ఘర్షణలు రేపొద్దు

◆విభజన హామీల అమలుకై పోరాడాలి
◆కేంద్రంపై పోరుకు కలిసిరావాలి
◆సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

ప్రజాశక్తి-అనంతపురం

అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపిల మధ్య గతకొన్ని రోజులుగా జిల్లాలో చోటు చేసుకుంటున్న పరిణామాలు ప్రజల మధ్య ఘర్షణలకు దారితీసే విధంగా ఉన్నాయని, ఇది సరైంది కాదని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ పేర్కొన్నారు. మంగళవారం నాడు స్థానిక గణేనాయక్ భవనంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయనతోపాటు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నాగేంద్రకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ ఇటీవలి కాలంలో అనంతపురం జిల్లాలో అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి నాయకుల మధ్య సాగుతున్న మాటల యుద్ధం జిల్లాలో మరోమారు ఫ్యాక్షన్‌ను పురుడుపోసే విధంగా ఉందన్నారు. ఒకరినొకరు రెచ్చగొట్టుకునే వ్యాఖ్యలు చేసుకుంటున్నారని తెలిపారు. రాప్తాడు, రాయదుర్గం, తాడిపత్రి నియోజకవర్గాల్లో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొంటున్నాయన్నారు. దేశంలోనే అత్యంత వెనుకబడిన అనంతపురం జిల్లాలో అనేక సమస్యలు రాజ్యమేలుతున్నాయని తెలిపారు. కరువు, వలసలు అధికంగానున్న ఈ జిల్లాలో రాష్ట్ర విభజన సమయంలో కేంద్ర ప్రభుత్వం అనేక హామీలను జిల్లాకు ఇచ్చిందని గుర్తు చేశారు. ఏ ఒక్క హామీని కేంద్రం అమలు చేయడం లేదని చెప్పారు. కేంద్రీయ విశ్వవిద్యాలయం పునాది దశలోనే ఉందన్నారు. నాసిన్, బెల్, కుదురేముఖ్ పరిశ్రమల ఏర్పాటు జరగలేదన్నారు. వెనుకబడిన ప్రాంతాలకు ఇస్తామన్న ప్యాకేజీని ఇవ్వలేదని తెలిపారు. వీటి సాధన కోసం అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి పోరాడేందుకు ముందుకురావాలని పిలుపునిచ్చారు. సాగునీటి ప్రాజెక్టులు హంద్రీనీవా, తుంగభద్ర సమాంతర కాలువ నిర్మాణాలు ఎన్నికల హామీలుగానే మారుతున్నాయి. ఈ సమస్యలపై కనీస చర్చ జిల్లాలో జరగకుండా ప్రధాన పార్టీలు రెండూ ప్రజలను రెచ్చగొట్టే విధంగా వ్యవహరిస్తుండటం విచారకరమన్నారు. ఇప్పటికైనా రెండు పార్టీలూ జిల్లా ప్రధాన సమస్యలపై దృష్టి సారించి వాటి పరిష్కారానికి పోరాడాల్సిన అవసరముందని పిలుపునిచ్చారు.

విలేకరులతో మాట్లాడుతున్న వి.రాంభూపాల్

నివురుగప్పిన నిప్పు..!

కరువుకు నిలయమైన అనంతపురం జిల్లా ముఠా రాజకీయాలకు పెట్టింది పేరు. అయితే గత కొంత కాలంగా ముఠా రాజకీయాలు సద్దుమణిగి ప్రశాంత వాతావరణం నెలకొంటోంది. ఇటువంటి తరుణంలో మరోమారు నేతల మధ్య సాగుతున్న మాటల యుద్ధాలు జిల్లా వాసులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. వ్యక్తిగతమైన దూషణలు, హెచ్చరికలు హద్దులు దాటి వస్తుండటంతో తిరిగి ముఠా కక్షలు రాజుకుంటున్నాయా అన్న సందేహాలను రెకెత్తించే విధంగా ఉంటున్నాయి.

◆హద్దులు మీరుతున్న మాటలు
◆మళ్లీ ముఠాకక్షలు రాజుకుంటాయన్న ఆందోళన

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఉమ్మడి అనంతపురం జిల్లా పరిధిలోని రాప్తాడు, ధర్మవరం, తాడిపత్రి, పెనుకొండ నియోజకవర్గాల్లో ముఠాకక్షలు అధికంగా ఉండేవి. అవి క్రమక్రమంగా తగ్గుతూ రావడంతో జిల్లావాసులు ఊపిరి పీల్చుకున్నారు. 2014 నుంచి చూస్తే ఒకటి, రెండు మినహా పెద్దగా ముఠాకక్షలు చోటు చేసుకోలేదు. 2014లో టిడిపి అధికారంలోకి వచ్చాక రాప్తాడు తహశీల్దార్ కార్యాలయంలో ప్రసాద్‌రెడ్డి హత్య ముఠా కక్షల్లో భాగంగా జరిగింది. ఆ తరువాతి కందుకూరులో ఒకటి చోటు చేసుకుంది. అటు తరువాత ఎటువంటి ఘటనలూ చోటు చేసుకోలేదు. సాధారణంగా పార్టీ అధికారం మారాక పలు హింసాయుత ఘటనలు చోటు చేసుకునేవి. 2019లో టిడిపి అధికారంలోకి పోయి వైసిపి అధికారంలోకి వచ్చాక అటువంటి ఘటనలుంటాయన్న ఆందోళన అందరిలోనూ నెలకొంది. అయితే ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలో ప్రశాంత వాతావరణం నెలకొనడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఇప్పుడు సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో నేతల మాటలు మరోమారు అందరిలోనూ కలవరాన్ని సృష్టిస్తున్నాయి. రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి సోదరుడు తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి మొద్దుశీనుకు చెప్పి ఉంటే చంద్రబాబు నాయుడిని హత్యచేసే వాడంటూ చేసిన వ్యాఖ్యలు సోషియల్ మీడియాలో దుమారం రేపుతున్నాయి. పరిటాల రవీంద్ర హత్య ఉదంతాన్ని ఆయన లేవనెత్తడంతో పాత రోజులను తిరిగి తీసుకురానున్నారా.? అన్న ప్రశ్న రాజకీయవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అంతకు మునుపు తాడిపత్రిలోనూ ఆ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి అస్మిత్‌రెడ్డి ఒక వార్డులో పర్యటిస్తూ ఉండగా అధికారపార్టీ నేతలు రాళ్లతో దాడి ఘటన కూడా కలకలం రేపింది. రాయదుర్గం నియోజకవర్గంలోనూ ప్రతిపక్ష నాయకులపై దాడి చేసారన్న ఆరోపణలున్నాయి. ఇలా వరుసగా చోటు చేసుకుంటున్న పరిణామాలు తిరిగి ముఠాకక్షలను పెంచే విధంగా ఉన్నాయన్న భయం జిల్లావాసుల్లోనూ మొదలవుతోంది. 2007కు ముందు వరకు జిల్లాలో పెద్దఎత్తున ముఠాకక్షలు చోటు చేసుకునేవి. ఆ తరువాత ప్రభుత్వాలు తీసుకొచ్చిన చర్యలతో కాస్త తగ్గుముఖం పడుతూ వచ్చాయి. తిరిగి ఇప్పుడు జరుగుతున్న పరిణామాలతో ఏమి జరుగుతుందోనన్న భయం జిల్లా వాసుల్లో నెలకుంటోంది. ఈ ఘటనల్లో పోలీసుల తీరు పట్ల కూడా కొన్ని విమర్శలు వస్తున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు కొంత వరకు కఠినంగా వ్యవహరించే విధంగా ఉంటున్నా క్షేత్ర స్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉంటున్నాయన్న ఆరోపణలున్నాయి. నియోజకవర్గ స్థాయిలో ముఖ్య నేతల కనుసన్నల్లోనే క్షేత్రస్థాయి అధికార యంత్రాంగం పనిచేస్తున్నట్టు ప్రతిపక్ష పార్టీల నాయకులు ఆరోపిస్తున్నారు. స్టేషన్లలోనూ అధికారపార్టీ నాయకులు అధికారుల సమక్షంలోనే చేయిచేసుకున్నా మౌనంగా ఉంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. క్షేత్రస్థాయి అధికార యంత్రంగం నిష్పక్షపాతంగా వ్యవహరించకపోతే నివురుగప్పిన నిప్పులావున్న ముఠా కక్షలు మరోమారు పురుడుపోసుకునే అవకాశాలున్నాయన్న ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతుండటం గమనార్హం.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి : డీఎస్పీ నరసింగప్ప

ఉరవకొండ : పోలీసులకు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని డీఎస్పీ నరసింగప్ప సూచించారు. ఈమేరకు మంగళవారం విడపనకల్ పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా పోలీసుల నుంచి గౌరవవందనం స్వీకరించారు. అనంతరం పోలీస్‌స్టేషన్ పరిసర ప్రాంతాలను కలియ తిరిగి స్టేషన్ శుభ్రతపై ఆరాతీశారు. అనంతరం స్టేషన్‌లోని పలు రికార్డులు, పెండింగ్ కేసుల వివరాలను ఎస్ఐ సురేష్‌బాబును అడిగి తెలుసుకున్నారు. రికార్డులు, కేసుల విచారణ, స్టేషన్ పరిశుభ్రత విషయంలో సంతప్తి వ్యక్తం చేశారు. అనంతరం సిబ్బంది బాగోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ దీన్‌దయాల్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌బికెల తనిఖీ

గుంతకల్లు రూరల్ : మండల పరిధిలోని ధోనిముక్కల, పట్టణంలో ఉన్న రైతు భరోసా కేంద్రాలను జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రామచంద్రానాయక్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెంటర్లలో రికార్డులను పక్కాగా నిర్వహించాలన్నారు. అదేవిధంగా 2022-23 సంవత్సరాలకు గాను ఖరీఫ్ సీజన్ ఈ క్రాప్ లను ప్రతి ఒక్క రైతుకు నమోదు చేసే ధ్రువీకరణ పత్రం ఇవ్వడంతో పాటు వారి చేత సంతకాలు చేయించుకోవాలన్నారు. అనంతరం రైతులకు ఈక్రాప్ ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. తర్వాత ధోనిముక్కలలోని ఎరువుల స్టాక్ పాయింట్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణి శశికళ, ఎఇఒ, ఎంపిఇఒ తిరుపాలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

లింగ వివక్షను రూపుమాపుదాం

ఉరవకొండ : లింగ వివక్షను రూపుమాపి సమాజంలో ఆడ, మగ సమానమే అని అందరికీ అర్థమయ్యేలా చాటి చెబుదామని విడపనకట్లు ఎంపిపి కరణం పుష్పావతి వేమిరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మండల పరిధిలోని గడేకల్ గ్రామంలో సూర్యోదయ మండల సమాఖ్య ఆధ్వర్యంలో లింగ వివక్ష మాసోత్సవాలు నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి ప్రధాన సర్కిల్‌లో మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లింగ వివక్షను రూపుమాపడంలో సమాజంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఇందులో భాగంగానే సిఎం జగన్ రాజకీయంగా మహిళలను ఎదగాలనే ఉద్దేశంతో 50శాతం మహిళలకు రిజర్వేషన్ కల్పించారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి సుశీల ఉమాశంకర్, ఉపసర్పంచి పార్వతి, పంచాయతీ కార్యదర్శి శిల్ప, ఐకెపి సిబ్బంది తిమ్మారెడ్డి, మహిళా సంఘం సభ్యులు, వైసిపి నాయకులు ఉమా శంకర్, హేమంత్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌కెయు విసి రామకృష్ణారెడ్డి నుంచి నియామక ఉత్తర్వు అందుకుంటున్న మురళీధర్

ఎస్‌కెయు ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్‌గా అసిస్టెంట్ ప్రొఫెసర్ మురళీధర్

అనంతపురం : శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ జాతీయ సేవా పథకం కోఆర్డినేటర్‌గా బయోటెక్నాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ మురళీధర్ మంగళవారం నియమితులయ్యారు. ఈమేరకు ఎస్కేయూ ఉపకులపతి ప్రొఫెసర్ రామకృష్ణారెడ్డి నుంచి ఉత్తర్వులు అందుకున్నారు. యూనివర్సిటీ పరిధిలోని అన్ని కళాశాలల్లో ఎన్ఎస్ఎస్ యూనిట్లు ఏర్పాటు చేసి విద్యార్థుల్లో సామాజిక బాధ్యతను పెంపుదల చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో వర్శిటీ పిఆర్ఒ రామగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య విద్యాబోధన

మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మైరెడ్డి నీరజ

అనంతపురం : ప్రభుత్వ మెడికల్ కళాశాలలో విద్యార్థులకు మెరుగైన వైద్య విద్యాబోధన చేసేందుకే అధ్యాపకులకు వైద్య కోర్సు వర్క్‌షాపు నిర్వహిస్తున్నట్లు మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మైరెడ్డి నీరజ అన్నారు. మంగళవారం నగరంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలోని అధ్యాపకులకు నేషనల్ మెడికల్ కమిషన్ నిబంధనలకు అనుగుణంగా కళాశాలలోని మెడికల్ ఎడ్యుకేషన్ యూనిట్ ఆధ్వర్యంలో సవరించిన ప్రాథమిక వైద్య కోర్సు వర్క్‌షాపు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రిన్సిపాల్ డాక్టర్ నీరజ మాట్లాడుతూ మూడు రోజులపాటు ఎంపిక చేసిన 30 మంది వైద్య ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాన్ని కాంపిటెన్సీ బేస్డ్ మెడికల్ ఎడ్యుకేషన్ 2019 మార్గనిర్దేశకత్వాల ప్రకారం ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ పూర్తయిన తర్వాత అందరికీ ధ్రువీకరణ పత్రం అందజేయనున్నట్లు తెలిపారు. వైద్య విద్యార్థులకు మరింత మెరుగైన వైద్య విద్యను అందించేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందనిన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఎడ్యుకేషన్ యూనిట్ కోఆర్డినేటర్ డాక్టర్ షారోన్ సోనియా, కళాశాల అకడమిక్ వైస్ ప్రిన్సిపళు డాక్టర్ ఆరేపల్లి శ్రీదేవి, మెడికల్ ఎడ్యుకేషన్ యూనిట్ సభ్యులు సంధ్య, భవానీ, హైమావతి, పద్మ శ్రావణి, సుమన, గోపీచంద్, శ్రావణి, అబ్దుల్ మజీద్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని భ్రష్టు పట్టించిన చంద్రబాబు

విప్ కాపు రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-రాయదుర్గం

ప్రజాస్వామ్యానికి పట్టుకొమ్మలైన పరిపాలన, శాసన, న్యాయ వ్యవస్థ, మీడియా రంగాలను టిడిపి అధినే చంద్రబాబు భ్రష్టు పట్టించారని విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం రాయదుర్గంలోని రోడ్డు, భవనాల శాఖ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసిన పద్ధతిని తప్పుపట్టిన చంద్రబాబు తాను అధికారంలో ఉన్నప్పుడు అదేతప్పు చేసి వేరే పార్టీల నాయకులను పార్టీలోకి పిలిచి పదవులు ఇచ్చారని గుర్తు చేశారు. ఓటుకు నోటు కేసే ఇందుకు నిదర్శనమన్నారు. అంతేగాకుండా ఎవి వెంకటేశ్వరరావు ద్వారా పరిపాలన వ్యవస్థను భ్రస్టు పట్టించారని ఆరోపించారు. న్యాయవ్యవస్థ అండగా ఉందని ధైర్యంతో రాజధానిలో జడ్జిలకు ఫ్లాట్లు ఇచ్చి మభ్య పెట్టారన్నారు. మూడు నెలల్లోగా ప్లాట్లు ఇవ్వాలని ఆరు నెలల్లోగా నిర్మాణం పూర్తి చేయాలని సుప్రీంకోర్టు అభిశంసించగా జడ్జీల బదిలీలు, ఇక ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభంగా చెప్పబడే మీడియా వ్యవస్థ, కుల వ్యవస్థ పరిణామం తీవ్ర ప్రభావం చూపిందన్నారు. చంద్రబాబు ఏం చేస్తే అది వార్త అని ఎల్లో మీడియా పత్రికా రంగాన్ని సర్వనాశనం చేశారన్నారు. టిడిపి దొంగలు పచ్చ కుక్కలు అయితే అందులో కాలవ శ్రీనివాసులు పెద్ద మురికి కాలువ అని ఎద్దేవా చేశారు. కాలవ శ్రీనివాసులు నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని హెచ్చరించారు. లేకుంటే వచ్చే ఎన్నికల్లో ఓడిపోయి కెఎ పార్టీకి పట్టిన గతి పడుతుందన్నారు. ఈసమావేశంలో వైసిపి రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి, గుమ్మగట్ట జడ్పిటిసి మహేష్, తదితరులు పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

గుత్తి రైల్వేస్టేషన్‌ను పరిశీలిస్తున్న దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్‌జైన్

గుత్తి పోర్ట్ రైల్వేస్టేషన్ ప్రారంభం

ప్రజాశక్తి-గుత్తి

పట్టణ శివారులో నూతనంగా నిర్మించిన గుత్తి ఫోర్ట్ రైల్వేస్టేషన్‌ను దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ మంగళవారం ప్రారంభించారు. ముందుగా గుత్తి రైల్వేస్టేషన్‌లోని వివిధ విభాగాలను పరిశీలించారు. పలు రైళ్లు దారి మళ్లించారని, వివిధ రైళ్లు గుత్తి రైల్వేస్టేషన్‌లో ఆగడం లేదని వైసిపి పట్టణ కన్వీనర్ డి.హుస్సేన్ పీరా, నాయకులు ఎం.రంగస్వామి, గురుప్రసాద్, కౌన్సిలర్ వరదరాజులు, గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయభాస్కర్ జీఎం దృష్టికి తీసుకెళ్లారు. ప్రయాణికుల సౌకర్యార్థం దారి మళ్లించిన రైళ్లను గుత్తి మీద వెళ్లేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

స్వామి హళ్లి-రాయదుర్గం రైలు మార్గం తుది సర్వేకు నిధులు మంజూరు

ప్రజాశక్తి-రాయదుర్గం

కర్ణాటక రాష్ట్రంలోని స్వామి హళ్లి నుంచి రాయదుర్గం వరకు కొత్తరైలు మార్గం ఏర్పాటుతోపాటు తుది సర్వే చేసేందుకు రైల్వేశాఖ రూ.5,94,52,402 నిధులు మంజూరు చేసినట్లు నైరుతీ రైల్వే హుబ్లీ డివిజన్ చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ అనీష్ హెగ్డే మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వామి హళ్లి నుంచి రాయదుర్గం వరకు 52 కిలోమీటర్ల మేర తుది లొకేషన్ సర్వేకు రూ.5.94 కోట్లు, బళ్లారి, హోసపేట నడుమ 65 కిలోమీటర్ల దూరం రైలుమార్గం నిర్మాణం సర్వే నిమిత్తం రూ.2,22,78,303 నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. రైల్వే శాఖ తన వినియోగదారుల రవాణా సౌకర్యాలను మెరుగుపరిచేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. నిర్ణీత గడువులోగా రెండు కొత్త రైలు మార్గాల తుది సర్వేను పూర్తి చేయనున్నట్లు తెలిపారు.

ఐఎంఎల్ డిపో వద్ద ధర్నా నిర్వహిస్తున్న హమీలీలు, సిఐటియు నాయకులు

హమాలీలకు కూలి రేట్లు పెంచాలి

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టి.రామాంజినేయులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఐఎంఎల్ డిపోలో పని చేస్తున్న హమాలీ కార్మికులకు ఎగుమతి కూలిరేట్లు రూ.7 నుంచి రూ.10లు, అరియర్స్‌తో సహా చెల్లించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టి.రామాంజినేయులు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం ఐఎంఎల్ డిపో వద్ద సిఐటియు జెఎసి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హమాలీలకు ఎగుమతి కూలి రేట్లు 2020 జనవరి 1న సిగ్మా కంపెనీ కాంట్రాక్టర్‌తో అధికారుల సమక్షంలో అగ్రిమెంట్ ఒప్పందం కుదిరిందన్నారు. అయితే ఆ ఒప్పందం కాల పరిమితి 2021 అక్టోబర్ నాటికి ముగిసిందన్నారు. 2021 నవంబర్ 1వ తేదీ నుంచి కొత్త కూలి రేట్లు అమలు చేయాల్సి ఉందన్నారు. పెరిగిన ఇంటి అద్దెలు, నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా కూలి రేట్లు పెంచాలన్నారు. గత సంవత్సరంలోనే రాష్ట్ర ఎస్‌బిసిఎల్ ఎండి, సిగ్మా కంపెనీ కాంట్రాక్టర్, రెవిన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ, సంబంధిత మంతులకు వినతిపత్రాలు అందజేశామన్నారు. స్పందన లేకపోవడంతో సమ్మె చేయాల్సి వచ్చిందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించకపోతే ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జెఎసి నాయకులు తిరుపాల్, నాగార్జున, మోహన్‌రెడ్డి, టి.నల్లప్ప, దేవదాసు, రమేష్, జయరాం, గౌరిశంకర్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులందరికీ బ్యాంకు రుణాలివ్వాలి

కౌలు రైతుసంఘం జిల్లా అధ్యక్షులు రంగారెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

కౌలు రైతులందరికీ షరతులు లేకుండా బ్యాంకు రుణాలు ఇవ్వాలని కౌలు రైతుసంఘం జిల్లా అధ్యక్షులు రంగారెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం ఉరవకొండలోని యూనియన్ బ్యాంకు ముందు కౌలు రైతుసంఘం ఆధ్వర్యంలో రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2019 కౌలు రైతుల చట్టం ప్రకారం సిసిఆర్‌సి కార్డులు ఉన్న ప్రతి ఒక్కరికీ ఎలాంటి షరతులు లేకుండా బ్యాంకు రుణాలు ఇవ్వాలని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నప్పటికీ స్థానిక అధికారులు మాత్రం ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. దీంతో కౌలు రైతులు వ్యవసాయ పనుల కోసం ప్రయివేట్ వ్యక్తుల వద్ద అధిక వడ్డీలకు అప్పులు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పు చేసి పంటలు పెడితే అతివృష్టి, అనావృష్టి కారణంగా పంటలు కోల్పోయి తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఈనేపథ్యంలో బ్యాంకు అధికారులు రుణాలు ఇచ్చి ఆదుకోకపోతే వారు ఆత్మహత్యలు చేసుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడతాయన్నారు. కావున వెంటనే కౌలు రైతులందరికీ వెంటనే రుణాలు మంజూరు చేయాలని కోరుతూ బ్యాంకు మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా నాయకులు జ్ఞానమూర్తి, కౌలు రైతుసంఘం మండల కార్యదర్శి మురళీ, కార్యవర్గ సభ్యులు సిద్ధప్ప, వన్నూరుస్వామి, రంగప్ప, మల్లికార్జున, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న కౌలురైతు సంఘం నాయకులు, రైతులు

ప్రజాశక్తి www.prajasakti.com

బొత్స సత్యనారాయణ ఉద్యోగులకు క్షమాపణ చెప్పాలి

అనంతపురం : ఉద్యోగులను అవమానకరంగా మాట్లాడిన విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు డిమాండ్ చేశారు. ఉద్యోగులు మీ మాదిరి ముఖ్యమంత్రికి బానిసలు కాదన్నారు. ఉద్యోగులు లేకుండా గంట కూడా పాలన సాగించలేరన్నారు. వెంటనే మంత్రి తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో వాళ్ల కాళ్లు పట్టుకున్నా తిరిగి నువ్వే గెలిచే అవకాశాలు ఉండవన్నారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సు

రాయదుర్గం : కార్తీకదీపం వెలిగించేందుకు ప్రయాణికుల కోరిక మేరకు రాయదుర్గం ఆర్టీసీ డిపో నుంచి అరుణాచలాని(తిరువన్నామలై)కు ప్రత్యేక ఆర్టీసీ బస్సు సర్వీసును ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ సురేష్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 5, 7వ తేదీల్లో సాయంత్రం 6 గంటలకు రాయదుర్గంలో బయలుదేరి కాణిపాకం వినాయక దర్శనం చేసుకుని చిత్తూరు, వేలూరు మీదుగా తిరువన్నామలై చేరుకుని అక్కడ అరుణాచలేశ్వరుని దర్శించుకుని దీపం వెలిగించి అదే రోజు అక్కడ నుండి సాయంత్రం ఐదు గంటలకు బయలుదేరి వేలూరులో ఉన్న బంగారు ఆలయాన్ని కూడా దర్శించుకుని రానున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు ఉపయోగించుకోవాలని కోరారు. ఇందుకు పోను, రావడానికి ఒక్కొక్కరికి రాయదుర్గం నుంచి రూ.1,950 టికెట్ ధర నిర్ణయించినట్లు తెలిపారు. వివరాలకు ఆర్టీసీ ప్రతినిధి గంగాధర్‌ను సెల్..94904 14623కు ఫోన్ చేయాలని కోరారు.

గొడవల జోలికి వెళ్లొద్దు : ఎస్ఐ

పుట్లూరు : గొడవలు జోలికి వెళ్లకుండా ప్రశాంతంగా జీవించాలని ఎస్సై గురుప్రసాద్‌రెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని శనగలగూడూరు గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని స్థానికులకు సూచించారు. అలాగే సైబర్ క్రైమ్, దిశా యాప్‌లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటుహక్కు కోసం నమోదు చేసుకోండి

పెద్దపప్పూరు : అర్హులైన గ్రాడ్యుయేట్లు ఎమ్మెల్సీ ఓటుహక్కు కోసం నమోదు చేసుకోవచ్చని తహశీల్దార్ షర్మిల సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన బిఎల్ఒల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం డిసెంబర్ 7వ తేదీ వరకు ఎమ్మెల్సీ ఓటుహక్కు కోసం నమోదు చేసుకునే అవకాశం కల్పించిందన్నారు. కావున అర్హులు ఎవరైనా మిగిలి ఉంటే నమోదు చేసుకోవాలని కోరారు.

In the court of the prl.Junior Civil Judge : Ananthapuramu
O.S. No: 436/2018

Between:
Sri Mahalakshmi Agro Distributors, Ananthapuramu, Rep by its Prop. Arveti Krishnamurthy ...plaintiff

V/S

Sri Sai Ram Fertilizers, V.Kothakota Village, Vidapanakal Mandal, Rep by its Prop. J.Raghavendra ...Defendant

Notice to Defendant.

పై దావాలో ప్రతివాది హాజరు నిమిత్తము పై కోర్టు వారు 30-11-2022వ తేది ఉదయం 10:30 గంటలకు వాయిదా వేసినారు. కావున నీవు ఖుద్దున గానీ, వకీలు ద్వారా గాని హాజరై ఏమైన ఆక్షేపణలున్నచో తెలుపుకొన వలెను. లేని ఎడల మీ పరోక్షమున తీర్మానము చేయుదురు.

(కోర్టు ఉత్తర్వుల మేరకు)

అల్లు.నారాయణప్ప,
అడ్వకేట్, అనంతపురం సెల్:9908616177

సివిల్ ప్రొసిజర్ కోడ్ 6 ఆర్డరు సమను

In the court of the IInd Addl.Junior Civil Judge : Ananthapuramu
O.S. No: 175/2022

Between:
C.Sreeramulu ...plaintiff

And

C.Ramu @ C.Ramanjaneyulu ...Defendant

Notice to Defendant

To
C.Ramu @ C.Ramanjaneyulu S/o Konda @ Kondanna, Rapthadu (V) & Mandal, Ananthapuramu (Dist).

పై దావాలోని ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తం నీ మీద వ్యాజ్యము తెచ్చినందు వల్ల సదరు దావాకు ప్రత్యుత్తరము చెప్పగలందులకు 2022 సం॥ డిసెంబరు నెల 29వ తారీఖున పగలు 10:30 గంటలకు స్వతహాగా ఆ కోర్టులో హాజరయ్యేటట్లు ఇందువలన నీకు ఆజ్ఞాపించడమైనది. నీ ప్రతివాదులకు ఆధారముగా నీవు సమ్మతమునకు వుద్దేశించి యుండే దస్తావేజులన్నింటిని ఆ రోజున హాజరు పరచుటకు నీకు వుత్తర్వు చేయడమైనది. పైన చెప్పబడిన దినమునందు నీవు హాజరు కాకుండా తప్పిన యెడల నీ పరోక్షమందు ఆ వ్యాజ్యమును విమర్శ చేసి తీర్మానించడమవునని నీవు తెలుసుకోవలసినది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

పి.రామలింగయ్య,
అడ్వకేట్, అనంతపురం సెల్:9440432235

In the court of the IInd Addl. Junior Civil Judge : Ananthapuramu
I.A.133/2019 in O.S. No: 307/2019

Between:
Yeddulapalli Nagesh @ Harijana nagesam ...plaintiff

And

Yeddulapalli Mailari @ Harijana Mailari and another ...Defendants

To
Yeddulapalli Muthyalu @ Harijana Muthyalappa S/o Mallappa, S.C.Colony, Narasanayani Kunta (V) Ananthapur (Rural) Mandal ...I.A.133/2019

మరియు

Now Residing at D.No:9B-5, Kalyanadurgam Town, Ananthapuramu (Dist). ...O.S. No: 307/2019

Notice D2

పై దావాలోని రెండవ ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తం నీ మీద వ్యాజ్యము తెచ్చినందు వల్ల సదరు దావాకు ప్రత్యుత్తరము చెప్పగలందులకు 2022 సం॥ డిసెంబరు నెల 28వ తారీఖున పగలు 10:30 గంటలకు స్వతహాగా ఆ కోర్టులో హాజరయ్యేటట్లు ఇందువలన నీకు ఆజ్ఞాపించడమైనది. నీ ప్రతివాదులకు ఆధారముగా నీవు సమ్మతమునకు వుద్దేశించి యుండే దస్తావేజులన్నింటిని ఆ రోజున హాజరు పరచుటకు నీకు వుత్తర్వు చేయడమైనది. పైన చెప్పబడిన దినమునందు నీవు హాజరు కాకుండా తప్పిన యెడల నీ పరోక్షమందు ఆ వ్యాజ్యమును విమర్శ చేసి తీర్మానించడమవునని నీవు తెలుసుకోవలసినది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

పి.రామలింగయ్య,
అడ్వకేట్, అనంతపురం సెల్:9440432235

శ్రమజీవుల పోరాటస్ఫూర్తి నండూరి ప్రసాదరావు

సిఐటియు ఆధ్వర్యంలో నివాళి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

స్వాతంత్య్ర సమర యోధుడు, మాజీ ప్రజాప్రతినిధి, సీనియర్ కమ్యూనిస్టు నాయకుడు కామ్రేడ్ నండూరి ప్రసాదరావు శ్రమజీవులు, కష్టజీవుల పెన్నిధిగా సేవలు అందించారని సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం.నాగమణి, ఎస్.నాగేంద్ర కుమార్ అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సిఐటియు వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి నండూరి ప్రసాదరావు 19వ వర్ధంతిని పురస్కరించకుని మంగళవారం సిఐటియు ఆధ్వర్యంలో గణేనాయక్ భవన్‌లో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కార్మికుల పక్షాన నండూరి ప్రసాదరావు ఆదర్శవంతమైన పోరాటాలు చేశారని గుర్తు చేశారు. రైతులు, వ్యవసాయ కార్మిక సంఘాలకు కూడా నాయకత్వం వహించి సమస్యల పరిష్కారం కోసం విజయవంతమైన పోరాటాలు చేశారన్నారు. అంతేగాకుండా రాజ్యసభ సభ్యునిగా, శాసనమండలి సభ్యునిగా పని చేసి రాజకీయాల్లోనూ తనదైన ముద్ర వేశారన్నారు. ప్రజా గాయకుడిగా, మంచి రచయితగా, బహుముఖ ప్రజ్ఞాశాలిగా సమాజ శ్రేయస్సుకు ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. ఆయన ఆశయాలను కొనసాగించడమే మనం ఇచ్చే నిజమైన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర కార్యదర్శులు వెంకటనారాయణ, ముర్తుజా, జిల్లా నాయకులు నాగభూషణం, రామాంజనేయులు, ప్రకాష్‌రెడ్డి, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సిఐటియు వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి నండూరి ప్రసాదరావుకు నివాళులర్పిస్తున్న సిఐటియు నాయకులు

అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నగరంలోని పలు ప్రాంతాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను కమిషనర్ భాగ్యలక్ష్మి మంగళవారం పరిశీలించారు. ఇందులో భాగంగా నగరంలోని నవోదయ కాలనీ, హౌసింగ్‌బోర్డు, లక్ష్మీనరసయ్య కాలనీ, తదితర ప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్యాన్ని పర్యవేక్షించారు. దుకాణదారులు కాలువలు, రోడ్లపై చెత్త వేయడాన్ని గమణించి ఇలాంటి వారిపై ఎందుకు అపరాద రుసుం విధించలేదని సిబ్బందిని ప్రశ్నించారు. అలాగే శానిటేషన్ సిబ్బంది చేతులకు గ్లౌసులు వేసుకోవాలన్నారు. పారిశుధ్య కార్మికులకు అందించాల్సిన పరికరాలు, వసతులపై ఎంహెచ్ఒ గంగాధర్‌రెడ్డి, ఎస్ఇ నాగమోహన్‌తో చర్చించారు. ఐదు రోజుల్లో వారికి ఇవ్వాల్సిన పరికరాలు, వసతులు కల్పించాలని ఆదేశించారు. తర్వాత పాతూరులోని 12వ డివిజన్‌లో ఉన్న పోస్టాఫీస్ వద్ద దీర్ఘకాలికంగా పేరుకుపోయిన చెత్తను తొలగించాలని సూచించారు. ఇక్కడ అపరిశుభ్రం చేయకుండా వెంటనే మొక్కలు నాటడంతోపాటు బెంచీలు వేయాలని సూచించారు.

శానిటేషన్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ భాగ్యలక్ష్మి

రాయదుర్గం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ హాల్ లో ఛైర్‌పర్సన్ పొరాల శిల్ప అధ్యక్షతన మంగళవారం సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీరో అవర్‌లో సభ్యులు పద్మజ మాట్లాడుతూ కొండపై నుంచి వచ్చే వర్షం నీరు కోట నుండి దుగ్గిలమ్మ ఆలయం వరకు వెళ్లేందుకు వీలుగా వర్షం కాలువను నిర్మించాలని కోరారు. 28వ వార్డు సభ్యుడు గోవిందరాజులు మాట్లాడుతూ పట్టణంలో దోమల బెడద అధికంగా ఉందన్నారు. టిడ్కో ఇళ్లను ఎప్పుడు లబ్ధిదారులకు అందజేస్తారో తెలపాలని కోరారు. బండి అజయ్ కుమార్ మాట్లాడుతూ కంపోస్ట్ యార్డ్ పక్కన ఉన్న కామన్ ఫెసిలిటీ సెంటర్ స్థలం పురపాలక సంఘానికి చెందిందని, డిఆర్డిఎ నుంచి ఈ స్థలానికి సంబంధించి నష్ట పరిహారాన్ని పురపాలకు సంఘం రాబట్టాలని కోరారు. అలాగే పాత మున్సిపల్ కార్యాలయ స్థానంలో కొత్త వాణిజ్య సముదాయం త్వరలో నిర్మించాలని కోరారు. వీటితోపాటు పలు సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. ఇందులో అధికారులు స్పందిస్తూ ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో 1వ వార్డు సభ్యురాలు నాగవేణి, ఉపాధ్యక్షులు శ్రీనివాస్‌యాదవ్, వలీబాషా, కమిషనర్ దివాకర్‌రెడ్డి, ఇంజినీర్లు రామమూర్తి, గోపీనాథ్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ రవీంద్ర, విభాగాలకు చెందిన అధికారులు, ప్రభుత్వ అధికారులు, వార్డు సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

తోపుదుర్తి చందూ వ్యాఖ్యల వెనుక ఎలాంటి కుట్రా లేదు..

ప్రజాశక్తి-అనంతపురం

రాప్తాడు ఎమ్మెల్యే సోదరుడు తోపుదుర్తి చందు వ్యాఖ్యల వెనుక ఎలాంటి కుట్ర కోణం లేదని వైసిపి జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య అన్నారు .మంగళవారం స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షాలు తోపుదుర్తి కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేయడంతో మానసిక వేదనతో చందు అలా మాట్లాడారని చెప్పారు. ఇందుకు ఆయన క్షమాపణ, విచారం వ్యక్తం చేశారన్నారు. ఇకపోతే జాకీ పరిశ్రమ టిడిపి హయంలోనే వెనక్కి వెళ్లిందన్నారు. ఈ సమావేశంలో యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ హరీష్‌యాదవ్, మాజీ అధ్యక్షులు పామిడి వీరాంజనేయులు, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, ఆర్టీసీ, నాటక అకాడమీ ఛైర్మన్లు మంజుల, హరిత, తదితరులు పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న వైసిపి జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

మండలంలోని జూటూరు బిసి బాలికల హాస్టల్‌లో పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్య సమస్యలపై మండల వైద్యాధికారి డాక్టర్ కళ్యాణ్‌కుమార్ మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ ఇళ్లతోపాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం చింతలపల్లిని సందర్శించి దీర్ఘకాలిక వ్యాధుల రోగులకు సలహాలు, సూచనలు అందించారు. ముఖ్యంగా క్షయవ్యాధి సర్వేను పక్కాగా చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ చిన్న కంబయ్య, నాగరత్నాలు, హాస్టల్ వార్డెన్ సరస్వతమ్మ, హెల్త్ ప్రొవైడర్ సుస్మలత, హేమలత, ఆరోగ్య కార్యకర్త ప్రమీలమ్మ, నగిన, ఆశా కార్యకర్తలు రామాంజనమ్మ, పెద్దక్క, శ్యామల, తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ కళ్యాణ్‌కుమార్

'గడపగడపకూ మన ప్రభుత్వం'

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలోని 29వ వార్డులో మంగళవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విప్ కాపు రామచంద్రారెడ్డి ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకోవడంతోపాటు ప్రభుత్వ పథకాలపై కరపత్రాలు పంపిణీ చేశారు. ఇందులో భాగంగా విద్యుత్ స్తంభం శిథిలావస్థలో ఉందని స్థానికులు తెలపగా వెంటనే మార్చాలని విద్యుత్‌శాఖ ఎఇ బాలచందర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘం అధ్యక్షులు పొరాలు శిల్ప, ఉపాధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్, వలిబాషా, కమిషనర్ దివాకర్‌రెడ్డి, ఇంజినీర్లు రామమూర్తి, గోపీనాథ్, సానిటరీ ఇన్స్‌పెక్టర్ రవీంద్ర, వార్డు సభ్యులు గోవిందరాజులు, షబ్బీర్, వైసిపి నాయకులు ముస్తాక్, వైజాగ్ రవి, రిబ్కా, నాగేంద్రప్ప, సత్యనారాయణ, ఇస్మాయిల్, శివప్ప, నాగప్ప, కష్ణమూర్తి, ఉమాపతి, తదితరులు పాల్గొన్నారు.

బెలుగుప్ప : సిఎం జగన్‌తోనే గ్రామ స్వరాజ్యం సాధ్యమని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వై.విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కాలువపల్లి గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా..లేదా.. అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నట్లు తెలిపారు. కాగా మూడు రాజధానుల ఏర్పాటు అంశంపై సుప్రీంకోర్టు తీర్పు టిడిపి నేతలకు చెంపపెట్టు వికేంద్రీకరణపై సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులను స్వాగతిస్తున్నట్లు చెప్పారు. రాజధాని ఎక్కడ ఉండాలో నిర్ణయించే పూర్తి అధికారం రాష్ట్ర ప్రభుత్వానిదే అనే విషయం సుప్రీంతీర్పుతో బలపడిందన్నారు. కోర్టు తీర్పు తోనైనా చంద్రబాబుకు కనువిప్పు కలగాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసిల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంపిపి పెద్దన్న, కన్వీనర్ శ్రీనివాసులు కాలువపల్లి మాజీ ఎంపిటిసి వెంకటేశులు, పాఠశాల విద్యాకమిటీ ఛైర్మన్ మల్లారెడ్డి, సర్పంచి పెద్దన్న, సింగిల్‌విండో అధ్యక్షులు శివలింగప్ప, జి.శ్రీనివాసులు, రామాంజనేయులు, అధికారులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వృద్ధురాలితో మాట్లాడుతున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

కుందుర్పి : రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని జెడ్పిటిసి రాధాస్వామి అన్నారు. మంగళవారం మండలంలోని ఎస్.మల్లాపూర్ గ్రామంలో సర్పంచి మహదేవమ్మ అధ్యక్షతన రైతులకు శాశ్వత భూహక్కు పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ రైతు కష్టాలను గుర్తించి పైసా ఖర్చు లేకుండా భూవివాదాలను పరిష్కరిస్తూ శాశ్వత భూ హక్కు పత్రాలను అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కమల నాగరాజు, వైస్ఎంపిపి సోమనాథ్, మండల కన్వీనర్ సత్యనారాయణ శాస్త్రి, కో ఆప్షన్ సభ్యులు అతావుల్లా, సర్పంచి వరలక్ష్మి వెంకటేశులు, ట్రైయినీ డిప్యూటీ కలెక్టర్ నాగజ్యోతి, తహశీల్దార్ షావుద్దీన్, వైసిపి నాయకులు నరసింహులు, లింగప్ప, జగన్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సమర శంఖారావాన్ని అడ్డుకోవడం బాధాకరం



చంద్రగిరి పోలీస్‌స్టేషన్‌లో ఉన్న టిడిపి సర్పంచులు

శింగనమల : గ్రామాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని తిరుపతిలో చేపట్టిన సమర శంఖారావాన్ని అడ్డుకుని నాయకులను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించడం బాధాకరమని పంచాయతీ రాజ్ ఛాంబర్ మెంబర్ దేగల కృష్ణమూర్తి మంగళవారం ఒక ప్రకటనలో ఖండించారు. ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర అధ్యక్షులు వైవిబి.రాజేంద్రప్రసాద్, ప్రధాన కార్యదర్శి బిర్రు ప్రతాప్‌రెడ్డి సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు వానపల్లి లక్ష్మీ ముత్యాలరావు, తదితరులు తిరుపతిలో సమర శంఖారావానికి శ్రీకారం చుట్టారన్నారు. దీంతో నాయకులను అరెస్టు చేసి చంద్రగిరి పోలీస్ స్టేషన్‌కి తరలించడం బాధాకరమన్నారు. వెంటనే సర్పంచుల నిధులు, విధులు, అధికారాలతోపాటు కేంద్ర ప్రభుత్వ 14, 15వ ఆర్థిక సంఘం ద్వారా వచ్చిన రూ.8,660 కోట్ల నిధులను సర్పంచుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

గుత్తి : ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి పుట్టినరోజు వేడుకలు గుత్తిలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ వన్నూరుబీ భారీ కేక్ కోసం పంచిపెట్టారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. అలాగే కొత్తూరులో ఉన్న స్వీట్ సేవియర్ ఛారిటబుల్ ట్రస్టుకు చెందిన వృద్ధ, ఆనాథాశ్రమంలో వైసిపి నాయకుడు వై. రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో కేక్ కోసం పంచిపెట్టడంతోపాటు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఫరూక్, వరదరాజులు, వాల్మీకి శివరాం, మున్సిపల్ డీఈ ఇంతియాజ్ అలీ, వైసిపి నాయకులు గురుప్రసాద్, నిర్మల, యువనాయకుడు, షఫీ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమద్ వ్రతం

గుత్తి : పట్టణంలోని కోట ప్రాంతంలో ఉన్న శ్రీ రామస్వామి ఆలయంలో మంగళవారం హనుమద్ వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీరామస్వామి ఆలయ పున్ననిర్మాణం, జీర్ణోద్ధరణలో భాగంగా ఎలాంటి ఆటంకాలు కలుగకుండా నిర్విఘ్నంగా జరగాలని ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో హనుమంద్ వ్రతం చేశారు. అనంతరం ఆలయ నిర్మాణానికి భారీగా విరాళాలు ఇచ్చిన దాతలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, భక్తులు, దీక్షాపరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు విద్యార్థిని ఎంపిక

బెలుగుప్ప : రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు మండల పరిధిలోని రామసాగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని ఎం.ప్రేమలత ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు బాలాజీ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల అనంతపురంలో జరిగిన స్కూల్ గేమ్స్ అథ్లెటిక్స్‌లో 3000 మీటర్ల రన్నింగ్ రేస్‌లో ప్రేమలత ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. దీంతో అంతర్-17 విభాగంలో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు హెచ్.నారాయణ, ఉపాధ్యాయులు మురళీధర్, గోపాల్‌రెడ్డి, పురుషోత్తం, ఇందిరా, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు విద్యార్థుల ఎంపిక

అనంతపురం : అనంతపురం ఎస్‌కెయూ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీ టిసిఎస్‌లో రూ.3.6 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగాలు సాధించినట్లు ప్రిన్సిపల్ రామచంద్ర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ఎస్‌కెయూ ఉపకులపతి రామకృష్ణారెడ్డి అభినందించారు. ఇందుకు కృషి చేసిన అధ్యాపకులు, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ రామచంద్రను విసి అభినందించారు. భవిష్యత్‌లో ఎస్‌కెయూ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఉపాధి అవకాశాలు పెంచేందుకు కృషి చేస్తామన్నారు.

పంటకోత ప్రయోగాల పరిశీలన

గుత్తి : మండలంలోని తురుకపల్లి గ్రామంలో మంగళవారం చేపట్టిన పంటకోత ప్రయోగాలను జిల్లా వ్యవసాయ అధికారి చంద్రనాయక్ పరిశీలించారు. గ్రామానికి చెందిన ఇద్దరు రైతులు సాగు చేసిన పత్తిపంటలో అధికారులు కోత ప్రయోగం చేశారు. ఓ రైతు పొలంలో 650 గ్రాములు, మరోరైతు పొలంలో 620 గ్రాములు వచ్చినట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎడిఎ నారాయణనాయక్, ఎంపిపి జి.విశాలాక్షి, వ్యవసాయ సలహా బోర్డు ఛైర్మన్ రామరంగారెడ్డి, ఎఒ ముస్తాక్‌అహ్మద్, వైసిపి మండల కన్వీనర్ జి.గోవర్ధన్‌రెడ్డి, సర్పంచి సుందరమ్మ, ఎఇఒ పావని, వైసిపి నాయకులు సుభాష్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, హనుమంతురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగాలు నిర్వహిస్తున్న అధికారులు

నేరాలు ఘోరాలు

భార్యను చంపిన భర్త

మృతిచెందిన ప్రమీల

తాడిపత్రి రూరల్ : మండలంలోని ఎర్రగుంటపల్లి గ్రామంలో మంగళవారం విషాదం చోటు చేసుకుంది. భార్య ప్రమీల (35)ను భర్త పుల్లారెడ్డి హత్య చేశాడు. భార్యాభర్తలు ఇద్దరూ వ్యవసాయ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు. పుల్లారెడ్డి మద్యానికి బానిసై తరుచు భార్యాభర్తలు గొడవ పడుతూ ఉండేవారు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం పనిమీద తాడిపత్రికి వెళ్లి మద్యం తాగాడు. ఈక్రమంలో భార్యతో గొడవ పడి విచక్షణ కోలోయి దారిలోనే బండరాయితో కొట్టి హత్య చేశాడని గ్రామస్తులు తెలిపారు. మృతురాలికి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. హత్య చేసిన భర్త పరారీలో ఉన్నాడు.

వివాహిత ఆత్మహత్య

యాడికి : పిల్లలను పట్టణంలోని పాఠశాలలో చేర్పించి మంచి చదువు చెప్పించాలని భర్తతో గొడవపడి వివాహిత ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం రాత్రి మండలంలోని ఎన్.కొత్తపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. యాడికి మండలం ఎన్.కొత్తపల్లి గ్రామానికి చెందిన కిరణ్‌కుమార్, శిరీష (36) దంపతులకు ఒక కుమారుడు తనీష్‌చౌదరి, కుమార్తె శ్రద్ధాచౌదరి ఉన్నారు. యాడికిలో ఉన్న ప్రయివేట్ పాఠశాలలో తనీస్‌చౌదరి 6వ తరగతి, శ్రద్ధాచౌదరి 3వ తరగతి చదువుతున్నారు. ఈనేపథ్యంలో కుటుంబమంతా పట్టణానికి వెళ్లి అక్కడే పిల్లలను బాగా చదివించుకోవాలని శిరీష తరచూ భర్తతో గొడవ పడుతూ ఉండేది. అయితే 50 ఎకరాల పొలం పెట్టుకుని వదిలి పట్టణానానికి వద్దని భర్త కిరణ్‌కుమార్ వాదిస్తూ వస్తున్నాడు. ఇందులో భాగంగానే సోమవారం సాయంత్రం కూడా ఇదే అంశంపై భర్తతో గొడవ పడింది. దీంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈమేరకు శిరీష తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పెద్దపప్పూరు : ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడటంతో వ్యక్తి మృతిచెందిన ఘటన మంగళవారం తెల్లవారుజామున మండలం పరిధిలోని రెడ్డిపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల మేరకు.. దేవుని ఉప్పలపాడుకు చెందిన వడ్డే బాలప్ప (55) పెన్నానదిలో చేపలు పట్టుకుని అమ్ముకుని జీవనం సాగించేవాడు. ఈనేపథ్యంలో మంగళవారం తెల్లవారుజామున చేపలు పట్టుకునేందుకు వెళ్తుండగా రెడ్డిపల్లి గ్రామ సమీపంలోకి రాగానే ద్విచక్ర వాహనం అదుపుతప్పి రాయి మీద పడింది. దీంతో అక్కడికక్కడే మతి చెందాడు. గమణించిన స్థానికులు కుటుంబ సభ్యులు, పోలీసులకు తెలియజేశారు. వెంటనే ఎస్సై ఖాజాహుస్సేన్ ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

పెద్దపప్పూరు : మండలంలోని షేక్‌పల్లి గ్రామంలో నెలకొన్న స్థల వివాదంలో ఓవ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. బాధితుడు వెంకటనారాయణరెడ్డి తెలిపిన వివరాల మేరకు... మండల కేంద్రంలోని సర్వేనెంబర్ 194లో భూమిని గత కొన్నేళ్లుగా సాగు చేసుకుంటున్నట్లు తెలిపారు. ఈనేపథ్యంలో అధికారులు వచ్చి కార్యాలయానికి రావాలని, మాట్లాడాలని చెప్పారన్నారు. దీంతో కార్యాలయానికి వెళ్లగా ఇది ప్రభుత్వ స్థలం అని.. ఈ స్థలం గోడౌన్‌కు కేటాయిస్తున్నామని చెప్పారు. దీంతో మనస్థాపం చెందిన వెంకటనారాయణరెడ్డి అధికారుల ముందే పురుగుల మందు తాగాడు. దీంతో వెంటనే స్పందించిన అధికారులు స్థానికుల సాయంతో ఆసుపత్రికి తరలించారు. కాగా ఈ విషయంపై తహశీల్దార్ షర్మిలను వివరణ కోరగా సంబంధిత స్థలాన్ని గత జూలైలోనే ఊరు అవసరాల నిమిత్తం గోడౌన్‌కు కేటాయించామని, ఇదే విషయం చెబుతుండగా అప్పటికే వెంట తెచ్చుకున్న పురుగుల మందు తాగాడని తెలిపారు.

కర్ణాటక మద్యం పట్టివేత

గుంతకల్లు : పట్టణంలోని పాత గుత్తి రోడ్డు పెద్దమ్మ గుడి దగ్గర రెండవ పట్టణ సిఐ గణేష్,ఎస్సై నరేంద్రకుమార్ సోమవారం రాత్రి వాహనాలు తనిఖీలు చేస్తుండగా రూ.1.95 లక్షలు విలువైన 58 బాక్సుల కర్ణాటక టెట్రా మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ యు.నరసింగప్ప తెలిపారు. మంగళవారం రెండవ పట్టణ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రం బళ్లారి నుండి అక్రమంగా మద్యం తరలిస్తున్నారన్న సమాచారంతో సిబ్బంది పాత గుత్తి రోడ్డులో వాహనాలు తనిఖీలు చేస్తుండగా ఐదుగురు వ్యక్తులు ఆటోలో మద్యం తీసుకొస్తుండగా అదుపులోకి తెలుకునేందుకు ప్రయత్నం చేయగా ముగ్గురు ఆటో దిగి పారిపోయారన్నారు. వీరిలో బోయ రామాంజనేయులు, బోయ సురేష్ పట్టుబడ్డారు. నిందితులతో పాటు మద్యం బాక్సులు స్వాధీనం చేసుకుని కోర్టుకు హాజరు హాజరుపరచనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సిఐ గణేష్, ఎస్సై నరేంద్రకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

8 మందిని గాయపరిచిన పిచ్చికుక్క

ఉరవకొండ : ఉరవకొండ పట్టణంలో ఓ పిచ్చికుక్క వైరవిహారం చేసింది. పంచాయతీ కార్యాలయం వద్ద రోడ్డుపై వెళ్తున్న వారితోపాటు పాత స్టేట్‌బ్యాంకు సమీపంలో దాదాపు 8మందిపై దాడి చేసి గాయపరిచింది. ఈ ఘటనలో ఉరవకొండకు చెందిన జైను, కౌసర్‌తోపాటు ఇద్దరు, ఇంద్రావతి గ్రామానికి చెందిన రవీంద్ర, హోతూరు గ్రామానికి చెందిన రమేష్, లత్తవరం గ్రామానికి చెందిన జగన్నాథ్‌ను తీవ్రంగా గాయపరిచింది. గాయపడిన వారిని వెంటనే ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

విద్యార్థులు నైపుణ్యాన్ని పెంచుకోవాలి

రాయదుర్గం రూరల్ : విద్యార్థులు విలువలతో కూడిన నైపుణ్యాన్ని పెంచుకోవాలని ప్రిన్సిపల్ రఘురామ్మూర్తి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక కెటిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రేరణ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 21 రోజులుగా ప్రథమ సంవత్సరం విద్యార్థులకు జరుగుతున్న ప్రేరణ కార్యక్రమంతో విలువైన విషయాలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. క్రమశిక్షణ, విలువలతో కూడిన భవిష్యత్తుకు బాటలు వేయాలన్నారు. ఈకార్యక్రమంలో అధ్యాపకులు కిరణ్, ఫరీసా, బాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు రామకృష్ణ, గోవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

బీమాసాయం అందజేత

నార్పల : మండలంలోని శిద్ధరాచర్ల గ్రామ పంచాయతీ దుర్గం గ్రామంలో ఇటీవల మృతిచెందిన తిక్క మారెన్న కుటుంబానికి వైఎస్ఆర్ తక్షణ బీమా సాయం కింద రూ.10వేలను అందజేశారు. ఈమేరకు సర్పంచి సాకే రామాంజనేయులు మంగళవారం మృతుడి ఇంటికి వెళ్లి భార్య భార్య రామలక్ష్మి, కుమారుడు ఎర్రిస్వామికి సాయం అందించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటరెడ్డి, వెల్ఫేర్ అసిస్టెంట్ రామచంద్ర, హార్టికల్చర్ అసిస్టెంట్ కుపేంద్ర, వాలంటీర్లు భాగ్యలక్ష్మి, ఉమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

సాయివిజ్ఞాన్ విద్యార్థుల ఎడ్యుకేషనల్ ట్రిప్

అనంతపురం : నగరంలోని 3వ రోడ్డులో ఉన్న సాయి విజ్ఞాన్ పాఠశాల విద్యార్థులు ఎడ్యుకేషన్ ట్రిప్పులో భాగంగా మంగళవారం కుర్రకోడు జలాశయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం ఎంపి శ్రీనివాసులు, కరుణాకర్‌బాబు మాట్లాడుతూ ప్రపంచంలో జరుగుతున్న విశేషాలు విద్యార్థులకు తెలియజేయడంలో భాగంగా ప్రతి ఏడాది ఎడ్యుకేషనల్ ట్రిప్పు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా కొర్రకోడు జలాశయానికి విద్యార్థులను తీసుకెళ్లి జలాశయం వివరాలను విద్యార్థులకు వివరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వైస్ఎంపిపికి నివాళి

రాయదుర్గం రూరల్ : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి కొండయ్య ఆధ్వర్యంలో మంగళవారం ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వైస్ఎంపిపి సత్యనారాయణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మంచి భవిష్యత్తు ఉన్న సత్యనారాయణ అకాల మరణం చెందడం బాధాకరమని జడ్పిటిసి మల్లికార్జున అన్నారు. మండల ప్రజల పక్షాన నిలబడి వారి సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేసే తత్వం ఉన్న మంచి వ్యక్తి సత్యనారాయణ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి విద్యావతి, తహశీల్దార్ మారుతి, వైస్ ఎంపిపి శాంతీబాయి, కో ఆప్షన్ సభ్యుడు దిలావర్, వైసిపి నాయకులు రామాంజనేయులు, వ్యవసాయాధికారి మహేంద్ర, హార్టికల్చర్ ఆఫీసర్ దస్తగిరి, పంచాయతీ కార్యదర్శులు కొల్లప్ప, వేణు, అశోక్, బసవరాజు, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.